# లక్కీ 'డిప్ప'

- ఎన్.పద్మామస్తాన్

వరండాలో కూర్చుని ఆరోజు దినపత్రిక చదువుతోంది నీరజ. గేటు శబ్దం కావడంతో పేపర్‌లోంచి దృష్టిని గేటు వైపు మళ్లించింది. మెడలో టై కట్టుకుని చేతిలో పెద్ద బ్యాగ్ పట్టుకున్న వ్యక్తి గేటు తీసుకుని లోపలికి వస్తున్నాడు.

'సేల్స్‌మెన్ లాగున్నాడు. పట్టుకుంటే బంకలాగా వదలడు. ఏవో మాటలు చెప్పి అక్కరలేనివన్నీ అంటగడతాడు' అనుకుని-

"మాకేమీ అక్కర్లేదబ్బాయి!" అంది నీరజ.

దానికతను "మేడమ్! నేను మీరనుకుంటున్నట్టుగా సేల్స్‌మెన్‌ని కాదు" అన్నాడు వినయంగా.

"సేల్స్‌మెన్ కాకుంటే మరెవరు?" అన్నట్టుగా మొహం పెట్టింది నీరజ.

అతను నీరజ దగ్గరికొచ్చి బ్యాగ్ కిందపెట్టి అందులో నుండి ఒక పుస్తకం తీసి "మేడమ్! ఇది 6బి-12-1 ఇల్లే కదా!" అన్నాడు.

"అవును" అంది నీరజ.

"సార్ పేరేమిటి మేడమ్!" అడిగాడతను.

"గోపాల్‌రావు గారు" అని చెప్పింది నీరజ.

దానిని అతను తన పుస్తకంలో రాసుకుని నీరజ వంక తిరిగి చేటంత మొహం చేసుకుని "కంగ్రాట్యులేషన్స్ మేడమ్! మా లక్కీడిప్‌లో మీ ఇల్లు లక్కీహౌస్‌గా ఎంపికయ్యిందండీ" అన్నాడు.

ఆమెకేమీ అర్థంకాలేదు. "లక్కీడిప్పేంటి, లక్కీ హౌసేంటి?" అని అడిగింది. అతనొక ఐడెంటిటీ కార్డు తీసి చూపించి తాను ఫలానా మల్టీనేషనల్ కంపెనీ ఉద్యోగిననీ, వాళ్ల కంపెనీ గురించి చెప్పడం మొదలుపెట్టాడు.

★ ★ ★

"మా కంపెనీ నార్త్ ఇండియాలో చాలా పాపులర్. ఇక్కడ కూడా మా ప్రొడక్ట్స్ పరిచయం చెయ్యాలనుకుంటున్నాం. అందుకోసం ప్రతి ఏరియాలోని హౌస్ నెంబర్స్ నుండి లక్కీడిప్ తీసి లక్కీహౌస్‌ని ఎంపికచేశాం. ఆ ఇంటిలోని వాళ్లకి మా ప్రొడక్ట్స్ ఉచితంగా ఇస్తాం. ఈ ఏరియాకి మీది లక్కీ హౌస్‌గా ఎంపికయ్యింది" అన్నాడు.

'అసలే రోజులు బాగాలేవు. వీడు ఏదో పేరు చెప్పి ఇంటిలోకి జొరబడి వున్నదంతా ఊడ్చుకుపోతే దిక్కేంటి' అనుకుని నీరజ "సరే! తర్వాత రండి" అని చెప్పింది.

దానికతను మొహం చిన్నబుచ్చుకుని "మేడమ్! మీరు నన్ను చాలా నిరుత్సాహపరుస్తున్నారు. మీకొచ్చిన బహుమతుల్ని చూసి మీరెంతో సంతోషిస్తారనుకున్నాను. మీకేవన్నా అనుమానాలుంటే మా రీజనల్ మేనేజర్‌కి ఫోన్ చెయ్యండి" అంటూ ఒక విజిటింగ్ కార్డ్, ఒక అరడజను అట్టపెట్టెలు ఒకదాని తర్వాత ఒకటి వరుసగా ఆమె చేతిలో పెట్టాడు. ఆ పెట్టెల నిండా రకరకాల స్పూన్స్, ఫోర్క్‌లు, నైవ్స్ ఉన్నాయి.

'ఊరికే వచ్చినవి ఎందుకు కాదనాలి. ఫ్రెండ్స్‌కి ఇవ్వొచ్చు తీసుకుందాం' అనుకుంటుండగా అతను పుస్తకంలో ఏదో రాసి "మేడమ్! ఈ బహుమతుల్ని మా కంపెనీ హెడ్డాఫీసునుంచి మీ ఇంటికి చేర్చడానికి రెండొందల రూపాయలు ట్రాన్స్‌పోర్టేషన్ ఖర్చులయ్యాయి ఇదిగో బిల్లు. ఆ అమౌంట్ ఇచ్చి సంతకం చెయ్యండి" అన్నాడు.

నీరజకి ఆ కంపెనీవాళ్ళ సేల్స్‌టెక్నిక్ అర్థమయ్యింది. ఆ ప్యాకెట్ల విలువ రెండొందలకన్నా ఎక్కువేం ఉండదు. అదో 'లక్కీడిప్ప' అనుకుంది కోపంగా.

★

